# అలసటెరుగని విద్యావేత్త! అనేక విద్యాలయాల్లో ప్రిన్సిపాల్‌గా పనిచేసిన అనుభవజ్ఞురాలు *పప్పు జయా వేణుగోపాలరావు*

## -విజయనగరం నుంచి వచ్చిన విద్యా సంపన్నురాలు-

**కొం**దరు విద్యాబోధకులు విశ్రాంతి తీసుకోరు, కొందరు ఎప్పుడు రిటైర్మెంటు వస్తుందా- విశ్రాంతి తీసుకుంటూ పెన్షన్ రాళ్ళతో శేషజీవితం గడుపుదామా- యని ఎదురుచూస్తుంటారు.

పప్పుజయా వేణుగోపాలరావు మొదటి తరగతివారు. ఆ మొదటి తరగతిలో కూడా మొదటివారిగానే ఉంటారు. జయా వేణుగోపాలరావు నిర్నిద్రాపరురాలు. విద్యావిధానంలో ఏయే సంస్కరణలను తలపెట్టి, అమలుపరిచే విధానం వెదుకుదామా- అంటూ బుర్రను కంప్యూటర్‌గా పనిచేయిస్తుంటారు.



ఆమెతో నా కంత పరిచయం లేదు, కానీ ఆమెను ఎన్నో సభల్లో చూసాను. ఎంతోమంది ఆవిణ్ణి గురించి చెప్పగా విన్నాను. చిన్మయా రెసిడెన్సు స్కూలువారు పట్టుపరదా పరచి - తమ విద్యాలయానికి రమ్మని ఆమెను పిలిచారు. సాధారణ ఉపాధ్యాయునిగా గాకుండా ప్రిన్సిపాల్ పదవినే యిచ్చారు. అక్కడ అడుగు వేయగానే క్లాసులో కంప్యూటర్లు పెట్టించారు, పేపర్లు నోటు బుక్కులు, టెస్టుబుక్కులు లేకుండా క్లాసులో కంప్యూటర్లు. పరీక్షలనేవీ ఉండవు. 'ఇ' క్లాసును అమలు పరిచారు. విద్యార్థులకు అనువయిన శిక్షణ యిచ్చారు. మంచి ఫలితాలు సాధించారు.

విద్యావిధానం పురోగతికి కొన్ని మార్పులు అవసర మని ఆమె యెప్పుడో గ్రహించారు. మద్రాసు విద్యా శాఖకు ఎన్నో సలహాలు యిచ్చారు అంటే పిల్లల బంగారు భవిష్యత్తుకు ఎప్పుడో సూచిక (సిలబస్) నిర్ధారించుకున్నారన్న విషయం ఋజువవుతున్నది.

ఆమె స్వస్థలం విజయనగరం. విజయనగరం కళలకు పుట్టినిల్లు. ద్వారం వెంకటస్వామినాయుడు వంటి వాయులీన విద్వాంసులు, ఆదిభట్ల నారాయణదాసు వంటి హరికథోపాసకులు అక్కణ్ణుంచే అఖిల విఖ్యాతి గాంచారు. విజయనగరరాజులు విజయనగరాన్ని విద్యావిజయనగరంగా తీర్చిదిద్దారు.

అక్కణ్ణుంచీ వచ్చినదే యీ కవిత్రియనే సవితా వాక్ సరస్వతి. జయ, విజయ నగర విద్యా - జయ. మద్రాసు నగరం వచ్చి తన విద్యాకేతనాన్ని దశాబ్దాలపాటు మనఃఫలకంపై మనం ముద్రించుకునేంత భూషితమైన విద్యాక్రాంతమయింది.

వాళ్ల నాన్నగారు మిలటరీలో పనిచేసినందువల్లనేమో - ఆమె క్రమశిక్షణకు ఎక్కువగా ప్రాధాన్య మిచ్చేవారు. బిఇడి చదువుతుండగానే మరో విద్యాధికుడు, సంగీత సాహిత్యాలను రెండు కన్నుల్లో పెట్టుకుని, అపార మేధస్సును వయసుతోపాటు పెంచుకున్న పప్పువేణుగోపాలరావును ప్రేమించి పెళ్లి చేసుకున్నారు.

స్త్రీలలో ప్రధానత్రయ శీలంగా వాక్‌శక్తి గుణైశ్వరశక్తి, సాహసశక్తి ఉంటాయంటారు పెద్దలు. వీటికి తోడుగా విద్యా, విజ్ఞాన, వివేచనా శక్తులు దృఢంగా ఉన్నప్పుడు సావిత్రి (ఇక్కడ సరస్వతి) వంటి శక్తివంతురాలవుతుంది.

జయా వేణుగోపాలు లిరువురూ ఒకరినొకరు ప్రేమించుకున్నారు. పెద్దలను ఎదురించి పెళ్లి చేసుకున్నారు. వారి వృత్తి ప్రవృత్తులొకటే కావడం విశేషం. ఇద్దరూ పాఠశాలల్లో ఉపాధ్యాయులుగా పనిచేసారు. తరువాత మద్రాసుకు చేరుకున్నారు.

జయావేణుగోపాలరావు చిన్మయా రెసియడెన్షల్ స్కూలులో ప్రిన్సిపాలుగా పనిచేశారు. రిటైరైనా కూడా ఆమె తన నూతన విద్యావిద్వాన్వేషణా బాటను విడిచిపెట్టలేదు. చిన్నపిల్లల్లో సత్యధర్మం, న్యాయగుణశీలం పెంపొందించడానికి వాల్మీకి రామాయణమును, సులభగ్రాహ్యమయ్యేట్టు చిన్న చిన్న కథలుగా తీర్చి దిద్దుతున్నారు. పురాణేతిహాసాలను కూడా అదే రీతిగా బోధమయ్యేట్టు చేస్తున్నారు. ఉపనిషత్తుల విజ్ఞానం కూడా అనుపాన వైద్యంగా అర్థీకరిస్తున్నారు.

అధునాతన విద్యాబోధనలో, విద్యార్థులను క్రమ శిక్షణలోనుంచడంలో జయా వేణుగోపాలరావు జయే!

ఇప్పటి తరంవారు జయవేణుగోపాలరావులా బోధనలో ప్రతిభా సంపన్నులు కావాలి. మారుతున్న విద్యా పరిమాణ ప్రమాదపరిస్థితులకు ఎరగాకుండా, విద్యా ప్రణాళికలను రూపొందించుకోవాలి.

అప్పుడే విద్యార్థీ విద్యార్థినులు విజ్ఞాన సంపన్నులు కాగలరు. జయావేణుగోపాలరావు, పప్పువేణుగోపాలరావుల వంటి విజ్ఞాన సంపన్న దంపతులున్ననాడు దేశంలో నీతికరమైన విద్యకు కొరవ ఉండదు.

ఆంగ్లంలో చెప్పాలంటే మేడ్‌ఫర్ ఈచ్ అదర్ అనాలి. వారివుర్నీ దీర్ఘాయురారోగ్య సంపన్నులు కావాలని ఏడుకొండల ఱేడును ప్రార్థిస్తున్నాను. ●


*We Provide your comfortable Stay and Tasty Food Hospitality*

bd

**Bhimas Deluxe Hotel**

**(PROPRIETORS BHIMAS HOTELS LIMITED)**

**34-38, G.Car Street (Near Railway Station),**
**TIRUPATI - 517 501 (A.P.)**
**Phone : 0877-2225521, 6669199, Fax : 2225471**
**Website : www.bhimasdeluxehotels.com**
**E-mail : bhimasdeluxe@rediffmail.com**



# మయూరా ఎస్. జయరాంచౌదరి అనుంగుబిడ్డ - ఎస్. కృష్ణ కల్యాణకుమార్!!



సుడలగుంట హోటల్స్
సుడలగుంట ఆగ్రోమిల్లు
సుడలగుంట ఫ్లోర్‌మిల్లు
సుడలగుంట సుగర్‌మిల్లు

**శ్రీకృష్ణకల్యాణకుమార్ ట్రాన్స్‌పోర్టు**- ఇత్యాది ఎన్నో పరిశ్రమల స్థాపక నిర్వాహకుడు శ్రీ ఎస్ (సుడలగుంట) జయరామ్‌చౌదరి ఏకైక కుమారరత్నం చిరంజీవి సుడలగుంట కృష్ణకల్యాణకుమార్.

ఒక్కడే కుమారుడని బుజ్జగింపులు చేసినా, చదువులో ఉన్నత శిఖరాలు ఎదగడానికై లండన్ పంపించి సుశిక్షణా సుగుణ విద్యావంతునిగా తీర్చిదిద్దాడు జయరామ్ చౌదరి.

జయరామ్ చౌదరి పేరుకే జయరాముడు కాదు, ప్రతీ వ్యాపారంలోనూ జయరాముడు. ఆయన స్థాపించిన వ్యాపారములన్నీ విజయవంతంగా నిర్వహింప బడుతున్నాయ్. ఆయన ఏకైక సుతుడు కృష్ణకల్యాణకుమారుడు పేరుకు తగ్గ కల్యాణ సుగుణవంతుడు.

కృష్ణకల్యాణకుమారుడు ఇంగ్లాండు చదువులకు వెళ్లేముందు, నా ముందుకు పిలిపించి ఆశీర్వదించమన్నాడు జయరాముడు. మనఃపూర్వకంగా ఆశీర్వదించాను. సకల విద్యాసంపన్నుడై తిరిగివచ్చాడు.


కల్యాణకుమార్‌నకు వివాహం చేయసంకల్పించి, ఆయనకు ధనధాన్యసంపద లున్నందువలన, సకల యశోసంపన్న అయిన కన్యకోసం వెదికాడు, వెదికించాడు. నేను కనిపించినప్పుడల్లా 'అన్నా- అబ్బాయికి సుగుణవంశస్థురాలైన పిల్ల కోసం చూస్తున్నాను ఆశీర్వదించు మనకే ధన ఇబ్బంది లేవు. కావున డబ్బు దస్కం కట్నం కానుకలు అవసరం లేదన్నాడు. శుభమ్ భవతు అన్నాను. ఎన్నో పెద్దపెద్ద కుటుంబాల సంబంధాలు వచ్చాయ్. ఏంది అనుకూలంగా తోచలేదు. కానీ జయరామ్‌చౌదరి అన్వేషణం మానలేదు. 'ఏంవిటి అన్నా, అనేవాడు. ఎక్కడో అనుకూలవతి పుట్టేవుంటుంది అనేవాణ్ణి. మధ్యలో కొన్నాళ్ళు నేను తిరుపతి వెళ్లలేదు.

తరువాత వెళ్లినప్పుడు- 'అన్నా, ఎన్టీ రామారావుగారి (మోహనకృష్ణ కుమార్తె) మనమరాలి సంబంధం నిశ్చయమైంది. అంటూ శుభవార్త చెప్పాడు. మరో రకంగా చూస్తే ఆ చిరంజీవి నా శ్రేయఃకాముడు యు. విశ్వేశ్వరరావుగారి రెండవ కుమార్తె, కుమార్తె మనుమరాలు. జయరామ్‌చౌదరి యీ నిర్ణయం చెప్పేసరికి- సెహబ్బాష్- త్వరగా సుమూహూర్తం నిర్ణయించండి అన్నాను. "అన్నా నువ్వు రాకుండా పెళ్లెట్లా జరుగుతుంది- అన్నాడు. కానీ నేను వెళ్ళకుండానే పెళ్ళి జరిగిపోయింది.

ఇంతటి ఉపోద్ఘాతమెందుకు - అంటే కళ్యాణకుమార్- లండన్ విద్యాభ్యాసానికి వెళ్ళినప్పట్నుంచీ- నాకు గల వాత్సల్యానుబంధం. కుమారుని పెళ్లి చేసిన తరువాత జయరామచౌదరి మోములో పదహారువన్నెల ఆనందం కనిపించింది. ఇప్పుడా ఏకైక కుమారమనోహరుడు కృష్ణ కల్యాణకుమారుడు వ్యాపారబాధ్యతలు పంచుకుంటున్నాడంటే- నాకెంతో ఆనందంగా ఉంది. తండ్రీకొడుకులిరువుర్నీ 'దీర్ఘాయురారోగ్య ఐశ్వర్య సంపన్నులు కావాలని ఆశీర్వదిస్తున్నాను.



శ్రీకాళహస్తిలోని మయూరా
చక్కెర కర్మాగారం
ఇలాటి ఎన్నో భారీ పరిశ్రమల అధిపతి
జయరాం కుమారపతి.




# విశాఖలోని విశిష్ట పత్రికా రచయిత చింతా ప్రభాకరరావు

'విధివిలాసం' అనేసరికి చింతా ప్రభాకరావు స్ఫురిస్తారు. ఆయన్ను 'ఆశుకవి సామ్రాట్' అని ప్రముఖాంధ్ర వందితుల తరఫున ప్రదానం చేస్తున్నాం. చింతా ప్రభాకరరావు చింతలను పారద్రోలిన ప్రభాకరుడు. ప్రకృతి 'విధి' పరంగా నడుస్తుంది. విధి 'కాలం'లా ప్రవహించదు. ప్రకృతి స్నేహబద్ధ. అది అవిధేయత నెరుగదు; 'నేల' పచ్చదనాన్ని మెచ్చినట్లు, మంచివారి పట్ల 'విధి' నిబద్ధంగా మంచి పనులు చేయిస్తూంటుంది.

చింతా ప్రభాకరరావు అనుంగుపత్రిక విధి వాలాసం 'విధి'కి ఓ ఆలయాన్ని నిర్మింపజేసింది. ఇంతవరకూ విధిని వ్రాతనుకునేవాణ్ణి. చింతా ప్రభాకరరావు విధికో ఆలయం నిర్మించిన తరువాత 'విధి' పట్ల గౌరవభావం కలిగింది. గౌరవం, పూజ్యతను సంతరింపజేసింది. తృప్తిరస్తు, పుష్టిరస్తు అంటూ 'విధి' నొక అనుగ్రహప్రదాతగా విధి ఆలయ నిర్మాణం తీర్చి దిద్దింపచేసుకుంది.

తూర్పు గోదావరి జిల్లాలోని వశిష్టా తీరంలో ఉన్న మలికిపురంలో రెండు అంతస్థుల ఆలయం కట్టించి స్వారసవదనుడైన ప్రభాకరరావు విధినీ సాదు సుత్రామణి వంటి విధి సతీదేవతను ప్రతిష్టించారు. అన్నదాన వసతి కల్పించారు. భగవానుని శిరములపై 4 తులసి దళములు వేసి పూజిస్తే కోరిన కోరికలు తీర్చునంటారు. దక్షిణ తీరంలో కామాక్షమ్మ మూకుత్తు ముత్తు సముద్రంలోని 3 మీటర్ల వరకూ వెల్తురొసగినట్లు మలికీపురంలో 'విధిభగవానుడు' కోస్తాంధ్ర ప్రదాతగా తీర్చిదిద్దబడ్డారు.

కొబ్బరిచెట్లూ, కాల నలుపు మట్టిపొలాలూ ఉన్న చోట అన్నపానములకు కొరత లేకుండా 'విధి భగవానుని ఆలయంలో అన్న సంతర్పణ వసతి ఉండడం వలన అన్నపానీయాలు అలభ్యం కావనిపిస్తూంది.

'విధివిలాసము'ను నమ్ముకుంటూ, విధి భగవానునికో ఆలయం కట్టి, ఆయనకోరూపం కల్పించిన అపర రవివర్మ చింతా ప్రభాకరుణ్ణి చిరాయురారోగ్య ఐశ్వర్య సంపన్నుడు కావాలని 'ప్రముఖాంధ్ర ఆశీర్వదిస్తూంది. ●

# హనుమాన్ చాలీసా ఫలకాలను 108 దేవాలయాల్లో ప్రతిష్ఠించాలనెడు దీక్ష వహించిన మాతా కన్యాకుమారి!




హనుమాను చాలీసా –పారాయణము (ఫలశ్రుతి) విశిష్టం.

హనుమంతుడు కల్పవృక్షము, కల్పవృక్షాన్ని ఆశ్రయించిన అన్ని కోరికలు క్షణంలో నెరవేరుతాయి. అటువంటి కల్పవృక్షం దరికి చేర్చగల చక్కని సులభమైనది హనుమాను చాలీసా. ఈ హనుమాన్ చాలీసాను సాక్షాత్తు పరమేశ్వరుని ఆదేశాను సారము శ్రీగోస్వామి తులసీదాసుగారు రచించారు.

తులసీదాసు కేవలము వాల్మీకి యొక్క అవతారమని భారద్వాజ సంహితలో శివుడు పార్వతీదేవికి, క్రింది విధముగా చెప్పినట్లున్నది :

**వాల్మీకి స్తులసీదాసః**
**కలౌదేవీ భవిష్యతి ।**
**రామచంద్ర కథాందివ్యాం**
**భాషారూపం కరిష్యతి ॥**

కలియుగంలో వాల్మీకి తులసీదాసుగ అవతరించి, రామాయణమును రామచరితమానసముగానూ, శ్రీహనుమాన్ చాలీసాను రచించినారు. శ్రీ ఆంజనేయుని మనసారా పొగడుచు తన 'చాలీసా' రచన పూర్తియగు వరకు ఆయనను తనముందు కూర్చుండబెట్టుకున్నారు. తన తపఃశక్తి యావత్తు ధారపోసి నందువల్లే ఈ చాలీసాకు ఇంత అద్భుతశక్తి కలిగింది. శ్రీహనుమాను చాలీసా పారాయణము వలన శ్రీరాముని స్తుతి మరియు శ్రీఆంజేయస్వామి స్తుతి వలన కలుగు ఫలితములు, రెండును లభించుచున్నవి.



**హనుమంతుడు ఆశ్రిత జనమందారుడు. ఎవరిని ఎప్పట్నుంచీ అనుగ్రహిస్తాడో ఏయే మంచి పనులు చేయిస్తాడో అనూహ్యం.**

ఓ సాధారణ గృహిణి కన్యాకుమారి వొంటరిగా తన కుమారుడు, కుమార్తెతో చెన్నపట్నం వచ్చింది. ఆంజనేయుణ్ణి నిరంతరం పూజించింది. ఆమెను అనుగ్రహించిన హనుమంతుడు ఆమెను జనఃశ్రేయక గుర్వీణిగా తీర్చిదిద్దాడు.

ఆమె ఎవరివద్దనూ శిశ్రూష చేయలేదు. ఏ గురువునూ ఆశ్రయించలేదు. ఆంజనేయస్వామి వారినే ఉపాసించింది. ఆయన్నే గురువుగా భావించింది. ఆయన అనుగ్రహించాడు. ఆమె కొలువులో వెలిసాడు. ఆమెకు ప్రసన్నుడయ్యాడు. ఆమెకు వాక్సిద్ధి కూర్చాడు. విశేషంగా భక్తులు ఆమె హనుమన్మందిరానికి వస్తుంటారు. ఆమె హనుమాన్ చాలీసా ఫలకాలను రూపొందించి అనేక ఆలయాల్లో ప్రతిష్టింపచేస్తున్నారు.

ఆమె అంతరంగమున నిండి ఉన్నది హనుమంతుడే! హనుమన్మందిరం కట్టాలని కాంచీపురం సమీపంలోని 'దూసి' గ్రామంలో సువిశాలమైన స్థలాన్ని క్రయం చేసారు. అక్కడొక చిన్న హనుమన్మందిరాన్ని కట్టారు.

కన్యాకుమారి కుమార్తెయే – అంజనాపుత్రునిపై పై రేఖాచిత్రాన్ని గీసింది. ఆ రూపంలోనే ఆంజనేయుని విగ్రహాన్ని రూపొందింపచేయాలని చూస్తున్నారు.

ప్రస్తుతం 108 హనుమాన్ చాలీసా ఫలకాలను 108 ఆలయాల్లో ప్రతిష్ఠించాలనే దీక్ష వహించారు. ఆమె దీక్ష ఫలించుగాక! ●

రుచికి, సువాసనకి, ఆరోగ్యానికి నాణ్యమైన
"అజంతా"
వక్కపొడి
రవికుమార్ అండ్ కంపెని – చెన్నై
044 25204046, 26171341



# శ్రీ భగవద్గీతా మకరందం!

శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు



96

## పదునేడవ అధ్యాయము - శ్రద్ధాత్రయ విభాగయోగము

**21. యత్తు ప్రత్యుపకారార్థం ఫలముద్దిశ్య వా పునః**
**దీమతే చ పరిక్లిష్టం తదాదనం రాజసం స్మృతమ్.**

**వ్యాఖ్య :** ప్రత్యుపకారము కోరి చేయు దానము ఉత్తమమైనది కాదని నుడుపుచున్నారు. ప్రత్యుపకార మభిలషించి చేయు దానము బజారులోని వ్యాపార విధానమే కాగలదు. ఇచ్చి పుచ్చుకొను పద్ధతి అంత శ్రేష్ఠమైనది కాదు. అది రాజసదానపద్ధతియే యగును. మఱియు తనకేదియో ముమ్ముందు పరలోకాదులందు ఫలము కలుగునని ఆశించి చేయు దానము, అనగా ఫలాపేక్షతో చేయు దానమున్ను ఉత్తమమైనది కాదు, నిష్కామమముగా, భగవత్ప్రీత్యర్థముగా చేయు దానమే మహోన్నతమైనది.

'పరిక్లిష్టమ్' - కొందఱు దానము చేయునప్పుడు 'అయ్యో! ఈ వస్తువు పోవు చున్నదే' యని మనస్సులో బాధపడుచుందురు. మరికొందఱు ఇతరుల బలవంతముచే దానము చేయుచుందురు. అట్లు క్లేశముతో దానమొసంగుట ఉత్తమ పద్ధతి కాదు. అట్టిది సత్ప్రయోజనమున్ను గలుగజేయజాలదు. దానము చేయుట తన కర్తవ్యమని, (ధర్మమని) భావించి ఐచ్ఛికముగ, ఆనందముతో ఒకరికిచ్చుటయే సాత్త్విక దానము. తదితరము రాజస, తామస, దానములే యగును. కావున విజ్ఞుడు సాత్త్వికదానమునే అవలంబించవలెను.

**22. అదేశకాలే యద్దాన మపాత్రేభ్యశ్చ దీయతే**
**అసత్కృతమవజ్ఞాతం తత్తామస ముదామృతమ్.**

**వ్యాఖ్య :** దానము చేయునపుడు సత్కారభావనతో, మర్యాదతో, ఆదరముతో చేయవలెనేకాని, తిరస్కారభావముతోగాదు. అనాదరభావముతో 'పో! తీసికొని పో!' అని డబ్బు మున్నగువానిని విసిరివేయరాదు. తిట్టుకొనుచు ఇవ్వరాదు. అది యంతయు తామసలక్షణమేయగును. అట్టి తామసదానమువలన దానఫలితము ఎంతయో తగ్గిపోవును. లేక అసలు లేకుండను పోవచ్చును. ఏలయనగా అశ్రద్ధతో ఇవ్వబడు వస్తువు ఇవ్వబడనిదానితోనే సమానమని భగవానుడీ యధ్యాయమందే కట్టకడకు చెప్పబోవుదురు - (అశ్రద్ధయా హుతం దత్తం... అసదిత్యుచ్యతే); కాబట్టి ఇట్టి దానము నెవరును ఆచరించరాదు. సాత్త్వికదానమునే ఆచరించవలెను.

**23. ఓం తత్సదితి నిర్దేశో బ్రాహ్మణస్త్రివిధః స్మృతః**
**బ్రాహ్మణా స్తేన వేదాశ్చ యజ్ఞాశ్చ విహితాః పురా.**

**వ్యాఖ్య :** పరబ్రహ్మము వాస్తవముగ నామరూపరహితమైనను, భక్తులు ధ్యానించుటకు, చింతించుటకు, అద్దానికి నామములు నిర్దేశింపబడెను. అవియే 'ఓమ్' అనియు, 'తత్' అనియు, 'సత్' అనియు చెప్పబడును. అట్టి మంత్రముల చింతనద్వారా, లక్ష్యమగు పరబ్రహ్మమును జనులు చింతనజేయుచున్నారు. సాక్షాత్ పరబ్రహ్మము యొక్క వాచకములు కనుక ఆ మూడు నామములకు మహత్తరమగు శక్తి, పవిత్రతగలిగి యున్నది. వేదశాస్త్రాదులం దెల్లెడలను ఈ ప్రణవాది మంత్రములను గూర్చి విశేషముగ చెప్పబడియున్నది.

'తస్యవాచకః ప్రణవః' - ఆ పరమాత్మ యొక్క నామము ఓంకారము.

'తజ్జపస్తదర్థభావనమ్' - 'ఆ నామమును జపించుచు దానియర్థమును లెస్సగ భావించవలెను" - అని పతంజలి మహర్షియు ఓంకార మహిమను గూర్చి శ్లాఘించి యున్నారు. కర్మానుష్ఠానమందు ఏవైన లోపములు, విఘ్నములు, దోషములు మున్నగునవి యున్నచో అవియన్నియు పరమపవిత్రములగు ఆ మూడు నామముల యొక్క ఉచ్చారణచే పటాపంచలైపోవును. కనుకనే ఏ కార్యమును ప్రారంభించినను పెద్దలు ప్రణవోచ్చారణము చేయుదురు. మంత్రములన్నిటిలోను ప్రణవము శిరోమణియై యలరుచున్నది. కనుకనే ప్రతి మంత్రమునకును ఆదిలో ఓంకారము చేర్చబడుచుండును. అయితే 'ఓం తత్ సత్' అను మంత్రము నుచ్చరించునపుడు అద్దాని అర్థమును భావించుచు దాని వాచ్యరూపమగు పరబ్రహ్మమును చింతన జేయవలెను. భావముతో గూడినపుడు మాత్రమే మంత్రము ఎక్కువగ శక్తివంత మగును.

మఱియు వేదములు, యజ్ఞములు మున్నగునవి ఆ ప్రణవ మంత్రోచ్చారణము చేతనే నిర్మింపబడినవని చెప్పుటవలన వేదముల యొక్క మూలము, బీజము ఓంకారమే (పరబ్రహ్మమే) అయియున్నదని తేలుచున్నది. మఱియు వేదసార మంతయు, ఆ ప్రణవమునందే యున్నటుల గోచరమగుచున్నది. కావున వేదసార మగు ఓంకారము నుచ్చరించి భావమును మననము చేసినప్పుడు సమస్త వేదములను ఉచ్చరించినట్లే యగుచున్నది.


'ఓమ్ తత్ సత్' అనుదానికి మఱియొక అర్థమున్ను గలదు. ఓమ్ అనగా పరబ్రహ్మము, తత్ అనగా అది (ఆ పరబ్రహ్మము) ఒకటియే, సత్ = సద్వస్తువు, తక్కినదియగు దృశ్య జగత్తంతయు మిథ్యా వస్తువు అని యర్థము. కావున ఈ 'ఓమ్ తత్ సత్' అను మంత్రము యొక్క ఉచ్చారణ చేత 'బ్రహ్మసత్యం జన్మిథ్యా' అను సర్వవేదాంత సిద్ధాంతసార సంగ్రహము ప్రస్ఫుటమగుచున్నది. అట్టి నామోచ్చారణ చేయుచు సద్వస్తువగు బ్రహ్మమును సత్యముగ భావించుచు, మిథ్యాభూతమగు దృశ్యజగత్తును అసత్యముగ తలంచుచు వైరాగ్య భావమును అభివృద్ధిపఱచుకొనవలెను. సద్రూపదైవ భావనను, ఆత్మభావనను దృఢపఱచు కొనవలెను. 'ఓమ్ తత్ సత్' అను మంత్రమునకు ఈ క్రింది రెండు అర్థములున్ను చెప్పవచ్చును.

**24. తస్మాదోమిత్యుదాహృత్య యజ్ఞాదానతపఃక్రియాః**
**ప్రవర్తన్తే విధానోక్తా స్సతతం బ్రహ్మవాదినామ్.**

**వ్యాఖ్య :** 'ఓమ్. తత్. సత్' అను మూడు పదములలోను మొదటిది యగు 'ఓమ్' అను పదముయొక్క మహిమను వెల్లడించుచున్నారు - పరబ్రహ్మము యొక్క వాచకము (నామము) అయి అతిపవిత్రమై, మహాశక్తివంతమై యలరుచుండుటచే వేదవేత్తలందఱును తాము ప్రారంభించు యజ్ఞ దాన తపస్సులను క్రియలన్నిటియొక్క ఆదియందు ఎల్లప్పుడును 'ఓమ్' అను ఆ ఏకాక్షర ప్రణవమంత్రమును ఉచ్చరించుచున్నారు. అట్టుచ్చరించిన పిదపయే ఆ యా క్రియలను వారు ఉపక్రమించుదురు. (అట్లే ఆ యా క్రియలు సమాప్తమైన వెనుకను మఱల 'ఓమ్' అని (ఆ ప్రణవమును) ఉచ్చరించుదురు. అట్లొనర్చుటవలన ఆ యా క్రియలలో ఏవైన లోపములు, దోషములు ఉన్నచో అన్నియు తన్మంత్రప్రభావమువలన భస్మీభూతములై పోవ ఆ కర్మలు పరిపూర్ణ ఫలముల నొసంగగలవు.

'సతతమ్' - (ఎల్లప్పుడును) అని చెప్పుటవలన అట్టి వేదవేత్తలు తామాచరించు ఆ యా యజ్ఞదానిది సత్క్రియల ప్రారంభమున ఎల్లప్పుడును ఆ ప్రకారమే ప్రణవోచ్చారణము చేయుదురని స్పష్టమగుచున్నది. అందువలన రైలుపెట్టెలన్నియు కదలునట్లును, ఒకటి యను సంఖ్యచే ప్రక్కనగల పూర్ణానుస్వారములు (సున్నలు) అన్నియు శక్తివంతము లగునట్లును, మొదటగల ఓంకారముచే తక్కిన మంత్రములు క్రియలు అన్నియు చైతన్యవంతములు, ప్రతిభావంతములు అగును.

*(తరువాయి వచ్చే సంచికలో)*



పిఠాపురం (తూర్పు గోదావరి)లో పానుగంటి నివసించిన ఇల్లు

# పానుగంటి లక్ష్మీనరసింహారావు అనగానే 'సాక్షి' ఒక్కటే చెబుతారు

## పానుగంటివారు రచించిన 'పాదుకాపట్టాభిషేకం' నాటకం పండిత పామరులను రంజింపచేసింది.

**కో**లంక సంస్థానం ముఖ్య గ్రామం లక్ష్మీనరసింహాపురం. దివాణంలో కచ్చేరి గది. దివానుగారు ఏకాగ్రచిత్తంతో ఏవో కాయితాలు పరకాయిస్తున్నారు. గదిలోకి ఒక పండితుడు ప్రవేశించి ఒక అర్జీ దివానుగారి చేతికిచ్చాడు. తమ వంశం తరతరాలుగా దివాణాన్ని అంటిపెట్టుకొని ఉన్నదనిన్నీ, దివాణం వారి యశోప్రతిష్టలకు తమ వంటి పండితులను పోషించడమే కారణమనిన్నీ, జమీందారిణీవారు తనకెన్నో మార్లు లోగడ ధనసహాయం చేసి ఉన్నారనిన్నీ, ఇప్పుడు తన కుమారుని వివాహం తాలూకూ యావత్తు ఖర్చున్నూ భరించవలసినదనిన్నీ, అందువలన జమీందారిణీ వారికి శాశ్వత బ్రహ్మలోక నివాసం ప్రాప్తించగలిగినంతటి పుణ్యం లభించగలదనిన్నీ అర్జీ పెట్టుకున్నారు.

ఆ అర్జీలో విషయాన్ని ఒక్క నిమిషంలో చదివేసి, ఉత్తరక్షణంలో 'దసుకుబల్ల'పైని సిరాబుడ్డిలో కలాన్ని ముంచి "ప్రస్తుతం రాణీవారికి అంత పుణ్యం జరూరుగా అవసరం లేనందున దరఖాస్తు త్రోసివేయడమైనది" అని రాసేశారు దివాను.

మరోసారి అదే దివానుగారు సాయంత్రపు వ్యాహ్యాళికి వెళుతుండగా రాజబంధువైన వెలమదొరగారు ఎదురుపడ్డారు. ఆయన కించిత్ వైద్యుడు. దివానుగారు 'వైద్యం ఎలా సాగుతున్న'దని కుశలప్రశ్న వేశారు దొరగారిని. 'ఇప్పుడు వైద్యం మానేశానండీ, కవిత్వం సాధన చేస్తున్నాను' అని బదులిచ్చేడాయన. "ఏదైతేనేమి లెండి జనాన్ని చంపడానికి" అని చురకేశాడు దివానుగారు. ఇలాంటి సంఘటనలు మరికొన్ని జరిగాక ఆశ్రితుల ఫిర్యాదులు ఎక్కువై రాణీవారు దివానుకు ఉద్వాసన పలికారు. ఆ దివాను పేరే పానుగంటి లక్ష్మీనరసింహారావు పంతులు.

ఆయన 11.2.1865 నాడు జననమందారు. 1.1.1940 నాడు గతించారు. అంటే ఈ సంవత్సరానికి పానుగంటి జన్మించి 150 యేళ్లు. నిష్క్రమించి 75 యేళ్లు.

**పా**నుగంటి రాజమండ్రి సమీపంలోని సీతానగరంలో వేంకట రమణయ్య, రత్నమ్మ దంపతులకు జన్మించారు. తండ్రి ఆ ప్రాంతంలో పేరుమోసిన ఆయుర్వేద వైద్యుడు. తల్లి ప్రేమకు ఎక్కువకాలం నోచుకోలేదు పంతులుగారు. 1888 నాటికి బి.ఎ. పూర్తిచేశారు. ఆ రోజులలో అది చాలా గొప్ప. అయినప్పటికీ పానుగంటి వారెక్కడా తన డిగ్రీ గురించి చెప్పుకోలేదు. పెద్దాపురం హైస్కూల్‌లో ఉపాధ్యాయునిగా చేరారు. కొత్తపల్లి జగ్గారావు గారనే వెలమదొర ఆహ్వానం మీద వారి పిల్లలకు ట్యూటర్‌గా చేరి హైస్కూలు ఉద్యోం మానేశారు.

ఇలా ఎన్ని ఉద్యోగాలు చేసారో, ఎన్ని మానేశారో! 1910లో ఆంధ్ర సాహిత్య పరిషత్ నాల్గవ వార్షిక సభలు బళ్లారిలో జరిగాయి. ఆ సభలకు 'నరపతి సింహాసనాధీశు'లగు అనెగొంది సంస్థానాధిపతి శ్రీరంగదేవరాయులు అధ్యక్షులు. ఆ సమయంలో రాయలకు, పానుగంటికి పరిచయం కలిగింది. పంతులుగారి బహుభాషా ప్రావీణ్యత, చాకచక్యము, సమయస్ఫూర్తి, హాస్యచతురత రాయలను ఆకట్టుకున్నాయి. శ్రీరంగ దేవరాయలు కూడా సాహితీ ప్రియులు. దత్త మండలాల రెవెన్యూ శాఖలో పంతులుగారి సమీప బంధువు ఢిల్లీ జగన్నాథరావు డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్నారు. ఆయన్ని రాయలు సలహా అడిగారు. పంతులుగారు దివానుగా తీసుకొంటే ఎలా ఉంటుందని ఆ మీదట పానుగంటి అనెగొంది దివాను అయ్యారు.



భార్య అప్పాయమ్మతో పానుగంటి



రావు వేంకట కుమార మహీపతి సూర్యారావు



లక్ష్మీనరసింహ ద్వయయం : పానుగంటి, చిలకమర్తి

అనెగొంది నిజాం సంస్థానంలో జమిందారీ, అక్కడ ఉర్దూ, పర్షియన్ రాజభాషలు. నేర్చుకోకపోతే పనిసాగదని ఆ రెండు భాషలు నేర్చుకొన్నారు. సంస్థానంలో ముగ్గురు మల్లయోధులు ఉండేవారు. వారి వద్ద సరదాగా మల్లశాస్త్రమూ నేర్చుకొన్నారు. ఇంతా చేసి అక్కడున్నది 15 నెలలు.

తరువాత శ్రీకాకుళంలోని ఉర్లాం జమీందారికి కొద్దికాలం దివాన్‌గా ఉన్నారు. ఆ కొద్దికాలంలోనూ కోర్టు వ్యవహారాలను ఒక కొలిక్కి తెచ్చారు. అయినా అక్కడా ఉద్యోగం నిలవలేదు. ఇదంతా పంతులుగారి నిలకడలేనితనం కానేకాదు. భవిష్యత్తులో చాలా నాటకాలు రాయబోయేవాడికి, ఆంధ్ర భాషా సరస్వతికి జిగజిగమెరిసే ఆభరణం 'సాక్షి'ని సమర్పింబోయేవాడికి, లోకాచారాలతో మత విరుద్ధము, సంఘోపద్రవకరములైన దుష్ప్రవర్తనను గొంతుతో ఎగతాళి చేయబోయే వాడికి ఎంత లోకానుభవం ఉండాలి. మరెంత దేశం చూసి ఉండాలి. సంఘాన్ని ఎంత సూక్ష్మంగా పరిశీలించాలి. పంతులుగారి ఆలోచనం అదే.

పానుగంటి వారి జీవితంలో పిఠాపురం చివరి జమీందారు మహారాజా శ్రీ రావు వేంకట కుమార మహీపతి సూర్యారావు బహద్దర్‌గారిది ప్రముఖ పాత్ర. సూర్యారావుగారికి పంతులు గారంటే చాలా ఇష్టం, గౌరవం. ఎంత ఇష్టమంటే గులాబీ తోటలో ఒంటరిగా పానుగంటివారితో కులాసాగా గంటలకొద్దీ కబుర్లు చెప్పుకొంటూ తిరుగుతూండేవారు.

సూర్యారావు పిఠాపురం కోటలో ఎన్నో రకాల గులాబీలతో అందమైన తోటను వేయించారు. ఆ తోటలో ఒక్క పూవు కూడా ఎవరూ కోయకూడదు. మద్రాసులో ఒక బంగళాకు 'గులాబీ' అని పేరుపెట్టారు. (ఒకప్పటి గులాబీ ప్రాంగణంలో ప్రస్తుతం గోకులం కాలనీ ఉన్నది) అటువంటి తోటలో పానుగంటివారితో గడపడమే కాకుండా వీడ్కోలు సమయంలో ఒకటి రెండు పువ్వులు స్వయంగా తుంచి ఇచ్చేవారు.

సూర్యారావుగారు రాజ్యానికి రాకముందే పానుగంటివారితో పరిచయం ఉంది. ఆయన సంస్థాన వారసత్వ దావాలో ఉన్నారు. ఈయన రకరకాల చోట్ల ఉద్యోగాలలో స్థిరత్వం లేకుండా ఉన్నారు. ఇద్దరికీ స్థిమితం చిక్కాక దివాన్‌గానో, అసిస్టెంట్ దివాన్‌గానో పానుగంటివారిని ఆహ్వానించారు సూర్యారావు. ఇప్పటి వరకు సేవ్య సేవక సంబంధంతో విసిగిపోయిన పంతులుగారు స్నేహసంబంధం కోరుకున్నారు. ఫలితంగా పిఠాపురం సంస్థాన నాటక కవి పదవి రాజావారికి 'మిగుల నవ్వు పుట్టించు నాటకములు చేయుట' హాస్య ప్రసంగాలతో ఉల్లాసం కలిగించుట.

ఇప్పటికి పంతులుగారికి కుదిరిక లభించింది. పిఠాపురంలో రైల్వేస్టేషన్ వద్ద ఉన్న మేడలో నివాసం ఏర్పడింది. శరపరంపరగా అటు నాటకాలు, ఇటు వ్యాసాలు, ఎడాపెడా గ్రాంథిక భాష సమర్థన, వ్యావహారికి భాష నిరసన మొదలయ్యింది. పానుగంటివారు బి.ఏ. చదివేటప్పుడు షేక్స్పియర్ ఆయన్ను ప్రభావితం చేశాడు. షేక్స్పియర్ రాసినన్ని నాటకాలు తాను రాయాలని యువకోత్సాహంలో 30 నాటకాలు రాశారు.

పానుగంటివారు మాధ్వులైనా విశిష్టాద్వైతం వైపు మనసు మొగ్గింది. రాముడు, రామాయణం వారి జీవాత్మలు. అందుకే రామాయణం మొత్తాన్ని పాదుకా పట్టాభిషేకము, విజయ రాఘవము, వనవాస రాఘవము, కల్యాణరాఘవమను పేర్లతో నాలుగు నాటకాలుగా రాశారు. వారి నాటకాలలో రాధాకృష్ణ నాటకం నిలువెల్లా హాస్యం నిండి ఉన్నది. కంఠాభరణం నాటకంలో రంగస్థలంపై ఆదరణ గొన్నది.

వీటికంటే పంతులుగారి ప్రతిష్ఠను నెలబెడుతున్నవి సాక్షి వ్యాసాలు. అయితే వాటిమీద పంతులుగారికి చిన్న చూపు ఉండటం చిత్రం.

'సంఘదురాచార నిర్మూలన కరంబులును, పండిత పామర జనరంజకంబులును, సరస హాస్యాద్భుత రసమయంబులును, గంగా ఝరీ ప్రతీకాశ ధాటీ విరాజితంబులను, అమృత మాధురీ ధురీణంబులును, అపూర్వ భావభాసురంబులును, జ్ఞానదాయకంబులును హర్షదాయకంబులును" అగు సాక్షి వ్యాసాల గురించి పంతులుగారేమన్నారో తెలుసా? 'నా కీర్తిని ఎప్పటికైనను నిలుపునది నా నాటకములే. ఎడమచేతితో రాసి వైచిన సాక్షి వ్యాసములు కావు" అన్నారు.

అవి ఆంధ్రపత్రిక సారస్వతానుబంధంలో ప్రతి శనివారం పడుతుండేవి. వీటి ప్రచురణ వెనుక చిన్న కథ ఉంది. శతక కవుల చరిత్రకారుడు వంగూరి సుబ్బారావు పానుగంటివారికి స్నేహితుడు. కాశీనాథుని నాగేశ్వరరావు పంతులుగారికి సన్నిహితుడు. "మన పత్రికకు ఏదైనా రాయకూడదా" అని నాగేశ్వరరావు గారు సుబ్బారావుని అడిగారు. "ఇది వరలో సువర్ణలేఖ పత్రికలో (ఇది తణుకు నుండి వెలువడేది. పానుగంటివారి మేనల్లుడు ద్రోణం రాజు వెంకట రమణారావు సంపాదకులు) సాక్షి వ్యాసాలు పడుతుండేవి కదా. నా స్నేహితుడు రాశాడని, వాటిని మన పత్రికలో పునఃప్రారంభించుదామని అడుగుదాము" అన్నారు.

సాక్షి వ్యాసాల పద్ధతి, ఉద్ధృతి శ్రీశ్రీపదాలలో అందంగా ఉంటుంది.

(తరువాయి 16వ పేజీలో)

# నా అభిమాన మంగపతి గారు!

ఆయన్ను మంగపతి గారూ అనడమే సమంజసం. ఆయన నన్నెపుడూ గోటేటిగారూ! అనే సంబోధిస్తారు. ఆ రోజుల్లో హెచ్ఎంవి– హిజ్ మాస్టర్స్ వాయిస్ అనే గ్రామఫోను రికార్డింగు కంపెనీ ఉండేది. ఆనాడు సినిమా పాటలన్నీ గ్రామఫోను రికార్డులపైనే వచ్చేవి.

పెద్ద పెద్ద గాయనీగాయకులు పాడిన పాటల్ని కూడా గ్రామఫోను రికార్డులలోనే వినేవారం. ఆనాడు హోటళ్లలోగానీ, పెద్ద సమావేశాల్లోగానీ, పెళ్ళిళ్లువంటి శుభకార్యాల్లోగానీ– గ్రామఫోను రికార్డులే వేసి– లౌడు స్పీకర్లు ద్వారా వినిపించేవారు.

మంగపతిగారికి పిన్న వయసునుంచీ నాటకాల్లో ప్రవేశమూ, అభిరుచి ఉండడం వలన ఎందరో గాయనీగాయకులను ప్రోత్సహిస్తూ, వారి పాటలను రికార్డు చేసి గ్రామఫోను రికార్డుల మూలకంగా వారి పేరు జనబాహుళ్యంలో బహుళ ప్రచారమయ్యేట్లు ప్రోత్సహించేవారు.

ఎం.ఎస్. సుబ్బలక్ష్మి పాటల్నుగానీ, ఘంటసాలవారి ప్రైవేటు పాటలను రికార్డుల ద్వారా బహుళ ప్రచారంలోకి తెచ్చినది మంగపతిగారే! ఘంటసాల 'భగవద్గీత' శ్లోకాలను పాడించి వ్యాఖ్యానంతో శ్రోతలను పరవశింపచేసినదీ ఆయనే! మంగపతిగారికీ నాకూ ఉన్న అర్ధశతాబ్ది పరిచయంలో శతాధిక అనుభవాల్ని చెప్పవచ్చు.

ఇప్పుడాయన వ్రాసిన ఆత్మాను లేఖినిని చదువుదాం!

ప్రియమైన ఆత్మీయసోదరుదు శ్రీగోటేటి శ్రీరామారావుగార్కి మీ మంగపతి సహస్రనమస్కారములు. నేను యీ మధ్యకొంతకాలము ఊరిలో లేనందువల్ల మీ పూర్ణచంద్రదర్శన పండుగకు రాలేక మీ దర్శనము చేసుకునే అదృష్టం లేకపోయినది. అయినా మీ మధురవాణితో ప్రారంభమైన మైత్రి యింతవరకు ఎంతో సంతోషంగానే గడుస్తూ వస్తూంది. ఇప్పుడు మనం ప్రముఖాంధ్ర మార్గంలో నడుస్తున్నాం. కనుక కాలం మనకు అడ్డురాదు. గనుక ఆనాటి పండుగ నేడుగా ఎంచి ఒక చిన్ని కానుక వెయ్యిన్ని (సహస్ర) నూటపదహారు రూ చెక్కు మీకు సమర్పిస్తున్నాను. దయచేసి స్వీకరించి నన్ను ధన్యుణ్ణి చేయగోరుచున్నాను.

మీరు నేను చేయించిన రికార్డుల గురించి ఎన్నో పర్యాయాలు విశ్లేషించి రాసిన సందర్భాలు నేను ఎన్నటికీ మరువలేను. నా గురించే కాదు. ఎందరెందరో మహానుభావుల చరిత్రలు మీ పత్రికలో ప్రచురించి ప్రజానీకానికి ఎరుకపరిచారు. మంచి మనసుకు నమూనా మీరు! ఒరులను నొప్పింపక తానొవ్వక తిరుగాడు మహా మనీషి మీరు! నేను యింటికి వచ్చిన తర్వాత మీ సెప్టెంబరు పత్రిక చదివాను ఆణిముత్యాల్లాంటి మీ ముగ్గురు కుమారులు వెంకటేశ్వరరావు, నారాయణరావు, సాయిప్రసాద్‌గార్ల గురించి చదివిన తర్వాత నా కెంతో సంతోషమైనది. తలిదండ్రులకు కీర్తి తెచ్చేవారే పుత్రులు. ఆ విషయంలో మీరు మహా అదృష్టవంతులు. ఇక సాయిప్రసాద్‌గారి సతీమణి సుప్రీతా కుమార్తె అంజనాగార్ల అరంగేట్ర నృత్యం గురించి చదివిన తర్వాత మరీ సంబరపడిపోయాను. ఫోటోలో అంజన ముఖకవళికలు గమనించిన తర్వాత మీరు అమ్మాయిని ప్రోత్సహిస్తే నృత్యరంగంలో బాగా రాణించే అవకాశం వుంటుందని నేను ఊహిస్తున్నాను. ప్రోత్సహించండి. మనస్సుపొంగి రాస్తున్న వుత్తరాన్ని యింతటితో ముగిస్తున్నాను. మీకు సహస్ర పూర్ణచంద్ర దర్శనపండుగలే కాదు, ఎన్నో పండుగలు జరుపుకుని నిండు నూటయిరవై అయిదేళ్ల పండుగ జరుపుకోవాలని మా ఇలవేల్పు వేంకటేశ్వరస్వామి పాదాలకు మ్రొక్కుతున్నాను. సదా మీ మేల్గోరు పుట్టామంగపతి,

నమస్తే!

శ్రీరాముని దయ, శ్రీరామకృప సీతారామానుగ్రహ ప్రాప్తిరస్తు!

(15వ పేజీ తరువాయి)

లక్ష్మీనరసింహారావు పానుగంటి
సాక్షి వ్యాసాలు చదవడం మాననంటి
ఎంచేతంటే వాటిలో పేనులాంటి
భావానికాయన ఏనుగంటి
రూపాన్నియ్యడం నేనుగంటి

పంతులుగారు మనస్తత్త్వం బాగా చదివారు. వ్యాకరణం, తర్కం, జ్యోతిష్యం, ఆయుర్వేదం మరింత బాగా తెలుసు. అందుకే ఆయన నాటకాలలో, సాక్షి వ్యాసాలలో ఆయా శాస్త్రాల సంగతులు గాలి కబుర్లలా కాకుండా సంప్రదాయవేత్తలా ప్రశంసిస్తారు. అదే సమయంలో వాటిలో ఉండే వైరుధ్య అంశాలను ప్రస్తావించి ఎగతాళి చెయ్యకా మానరు.

1911 నుండి 1930 వరకు ఆయనకు యోగకాలం. రెండవ శ్రీనాథుడా అన్నట్లు బతికారు. ఖర్చుకు పిఠాపురంలో కోట తరువాత పంతులుగారి మేడే అని వాడుకకు వచ్చింది. కాలాంతరంలో సూర్యారావుగారికి, పంతులుగారికి విభేదాలు పొడసూపాయి. దీనికి పంతులుగారి నాలుకవాడి ప్రధాన కారణం. నెలకు 120 రూపాయల జీతం. దసరా ఉత్సవాల్లో 116 రూపాయల యినాం, రాజకుటుంబంలో శుభకార్యాల సమయంలో 1116 రూపాయల ప్రత్యేక బహుమానం పానుగంటికి అందేవి. ఇవికాక పంతులుగారి పుస్తకాలన్నీ రాజావారే అచ్చువేయించి, 100 ప్రతులు తాను తీసుకుని 900 ప్రతులు పంతులుగారికిచ్చేవారు.

హఠాత్తుగా ఈ మర్యాదలన్నీ తగ్గిపోయాయి. వేతనం 60 రూపాయలయ్యింది. అది కూడా లోగడ ఎప్పుడో తీసుకొన్న మొత్తానికి సగం విరగ్గొట్టబడి 30 రూపాయలు చేతికి వచ్చేవి. ఆ 30తో కూడా ఆ రోజులలో బాగానే వెళ్లదీయవచ్చు. కానీ ఖర్చుకి అలవాటుపడిన చెయ్యి సంక్షోభంలో పడింది. ఉన్మాదం కలిగింది. అందుకే సాక్షి వ్యాసాల చివరి భాగాలలో ఉన్మత్తుని ఉపన్యాసాలు ఎక్కువగా ఉంటాయి. గిరీశం గురజాడ ప్రతిరూపం అంటుంటారు. పంతులుగారి కంఠాభరణం నాటకంలో కృష్ణారావు పాత్ర తన గురించి ఇలా చెప్పుకొంటారు.

"నా మనస్సునందన్ని రసములున్నవి. సదాచారమున్నది. అభిచారమున్నది. భక్తియున్నది. రక్తియున్నది. వైరాగ్యమున్నది. పామరత్వమున్నది. నా మనస్సృష్టి వైఖరియట్టిది" అనే దంద్వ వ్యక్తిత్వం పంతులుగారిలో ఉంది. పిల్లలంటే అమిత ప్రేమ. ఆయనకు ఐదుగురు కుమారులు. ఇద్దరు కూతుళ్లు. సంతానాన్ని విడిచి ఉండలేని ప్రేమవారి ఎదుగుదలకు ఆటంకమయ్యింది. వారి షష్ట్యబ్ది ఉత్సవం 1935 ఏప్రిల్ 28న పిఠాపురంలో చిలకమర్తి లక్ష్మీనరసింహంగారి అధ్యక్షతన వైభవంగా జరిగింది. వారి మానసిక పరిస్థితి అదుపుతప్పి కుటుంబ వ్యవహారాలు తలకిందులయినా ఆయన సహజ హాస్యధోరణిని వదలిపెట్టలేదు. ఏవో బహుమతులు ఇవ్వబోతుంటే "ఉన్న ఒక మతిపోయి నేనేడ్చుచున్న ఈ సందర్భములో బహు 'మతు'లేల?" అని చమత్కరించారు. పాశ్చాత్య నాగరికతా వ్యామోహానికి గురికాకూడదనే హెచ్చరిక, మాతృభాషాభిమానం కలిగి సత్ప్రవర్తన పెంచుకోవాలి అంతశ్శుద్ధితో కూడిన దైవభక్తి ఉండాలనే వాంఛ ఆయనలో ప్రగాఢంగా ఉన్నది.

(మోదుగుల రవికృష్ణగారికి కృతజ్ఞతలు)



# జొన్నలగడ్డ వేంకట రమణమూర్తి అనడం కన్నా జె.వి. రమణమూర్తి సినీ జగద్విదితం

రెండు పుష్కరాలు వయసు రాకుండా నాటకాల్లో తన పస ఏమిటో చూపించాడు. గురజాడవారి 'కన్యాశుల్కం' నాటకంలోని గిరీశం పాత్రలోనే ఒక వెయ్యిరంగస్థలాలపై కనిపించడం రమణమూర్తి కళాభిమానుల అందరిమూర్తి అయ్యాడు.

తిరుపతిలో జరిగిన నందీ నాటకోత్సవాల్లో ఎన్టీయార్ రంగస్థల అవార్డు అందుకున్నాడని యెక్కడో చదివాను. ఎన్టీయార్ ఇలా వెయ్యి నాటకాల్లో నటించాడని వినలేదు.

అనుపమా పిక్చర్స్ కె.బి. తిలక్ అన్వేషణలో 'ఎం.ఎల్.ఏ' చిత్రంలో ప్రధానపాత్ర ధరించాడు. ఆ చిత్రం తొలిచిత్రమైనప్పటికీనీ దర్శక నిర్మాత కె.బి.తిలక్ రమణ మూర్తికి వంద చిత్రాల్లో నటించిన నటునికిచ్చినంత ప్రచారం చేసాడు. అనుపమా పిక్చర్సులో జరిగిన ప్రెస్‌మీట్‌లోనే రమణమూర్తిని చూశాను. పీటలమీద కూర్చున్న పెళ్ళికొడుకులా కనిపించాడు. ఆ ముఖంలోని నవ్వులో వంద పూర్ణిమాభాసిత మైన నవ్వు కనిపించింది; ఎందుకో రమణమూర్తిపై అంతులేని వాత్సల్యం పుట్టు కొచ్చింది.

అలా అలా ఓ 150 సినిమాల్లో చక్కటి చిక్కటి నటనావకాశం గల పాత్రలను ధరించాడు. అతడి అదృష్టం కొద్ది కె. బాలచందర్, కె. విశ్వనాథ్ వంటి దర్శకులు కలకాలం నిలిచే పాత్రల్లో నటింపచేసారు.

ఎంతగా సినిమాల్లో నటిస్తున్నప్పటికీనీ తనని అంత ఎత్తు ఎదుగుదలకు కారణమైన నాటకరంగాన్ని మాత్రం మరువలేదు. నటిస్తూనే ఉన్నాడు. అనుకోని విధంగా (ఆంగ్లంలో చెప్పాలంటే ఏక్సిడెంటల్‌గా) సినిమా నటుడైనట్లుగానే – ఓ రోడ్డు ప్రమాదానికి (ఏక్సిడెంటుకు) గురి అయ్యాడు. కోలుకుని నడుస్తాడని ఎవరూ అనుకోలేదు. బాగా పరిశీలిస్తే రమణమూర్తి– ఓ కాలి అడుగు తెలుస్తూనే ఉంటుంది. అతని అదృష్టవశాత్తూ, పుష్పగిరి శంకరాచార్యపీఠాధీశులు శ్రీశ్రీశ్రీ విద్యా నృసింహ భారతీస్వామివారు వార్తను గ్రహించి అవసర చికిత్స జరిగేట్టు చూసారు. అది వారి గురుశిష్యానుబంధాన్ని పెంచింది బేగంపేటలోని వారి వాసభవనంలో పలు పర్యాయ ములు చూచే అవకాశం కలిగింది. ముదివయసు వచ్చిననూ, మోములోని పూర్ణచంద్రవికాసం, నవ్వులోని జిగిబిగితనం సడలలేదు. పుష్పగిరి శంకరాచార్యుల వారి వాసభవనానికి తరచూ వస్తూ రావడం చూసాను. ఉభయ కుశలంగా విశేషా లను మాట్లాడుకునేవాళ్లం. 150 సినిమాల్లో నటించినా, వెయ్యి నాటక ప్రదర్శన లిచ్చినా హుందా (గర్వం) తనం యెక్కడా పొడసూపలేదు.

మరో వాత్సల్య విశేషమేమంటే రమణమూర్తి పుట్టినదీ నేను పుట్టినది 1933 సంవత్సరమే. నేను మార్చి 7న జన్మిస్తే, ఆయన మరో రెండు నెలల తరువాత మే 20వ తేదీన జన్మించాడు.

వివరాల్లోకి వెడదాం:

### రమణమూర్తికి అమ్మంటే అధిక ప్రాణం

అమ్మంటే ప్రాణం లేని వారెవరుంటారు. కానీ రమణమూర్తి అమ్మ శారదమ్మ నిజంగా శారదమ్మే. రమణమూర్తిలోని బుద్ధికుశలత, నాటక రంగంపై నటునిగా ప్రవేశించాలనే అభివ్యక్తత గ్రహించింది. అతణ్ణి రంగస్థల నటునిగా ఎదగడానికి ప్రోత్సహించింది. క్రమశిక్షణతో పెంచింది. క్రమాభివృద్ధికి కారకురాలైంది. ఇలాంటి అమ్మపై ఎవరికి అత్యధికాభిమానం, ప్రాణం ఉండదు? కావున జె.వి. రమణమూర్తిని సంజీవ శరదశ్శతమ్ అందాము.

రమణమూర్తిలో ఆత్మాభిమానం యెక్కువ. అతడు అవకాశాల కోసం వెంపర్లాడి ఉంటే మరో 150 సినిమాల్లో నటించేవాడు.

వంశధారాతీరంలో నరసన్నపేట సమీపంలోని లుకలాం ఆయన వాసస్థలం. తండ్రి వెంకట శివరామమూర్తిగారి ఉద్యోగం కారణంగా విజయనగరం వెళ్ళారు. విజయనగరం రాజుల హయాం నుంచీ సంగీత, కళా, సాహిత్య ప్రోద్బలకంగా ఉన్నది. గ్రాంథికంగా ఉన్న 'కన్యాశుల్కం' నాటకాన్ని మాతృక చెడకుండా వ్యవహార భాషలో ఉండేట్టొక బృహత్ప్రయత్నం చేసారు. గురజాడ సాహిత్యజాడ నీడలోనే నాటకం ఆద్యంతమూ రక్తి కట్టింది. రమణమూర్తి చిన్నన్నయ జె.వి. సోమయాజులు కూడా నాటకనటనా ప్రవీణుడే. రమణమూర్తి సినిమాలకు వచ్చిన తరువాతనే సోమయాజులు సినీ రంగప్రవేశం చేశారు. ఆ ఆరంగేట్రమ్, 'శంకరాభరణం' చిత్రంగా వచ్చింది. సోమయాజులు నటించిన ఆ చిత్రం వీరవిహారం చేసింది.

రమణమూర్తికి నాటకాలపై అత్యధిక ఆసక్తి ఉన్నప్పటికీనీ, చదువుపై అశ్రద్ధ చూపలేదు. విజయనగరంలో బీఎస్‌సీ పట్టభద్రుడయ్యాడు. నటవిశ్వ విద్యాలయంలో ఎప్పుడో పట్టభద్రుడయ్యాడు. మనసారా రమణమూర్తిని ఆశీర్వదిస్తున్నాను. ●

*Lovely Stay at Holy Tirupathi* *The Gateway of Lord Balaji*

**HOTEL MAYURA**

204, 209, T.P. Area, Tirupati - 517 501 (A.P.)
(Opposite Bus Station)
Phone : 0877-2225925, 2225251, Fax : 0877-2225911
e-mail : mayurahotels@yahoo.co.in, Grams :

# రాణి కుముదినీ దేవి

అద్దాల మేడలో నివసించినా జనం అభివృద్ధికి కృషిచేసిన అరుదైన సేవాశీలి ఒకనాటి హైదరాబాద్ మేయర్ జనంపల్లి కుముదినీదేవి. కాకతీయ ప్రాభవాన్ని నేటికీ కళ్లకు కట్టిచూపిస్తోన్న వరంగల్‌లోని వడ్డేపల్లి అనే గ్రామంలో పింగళివారింటి జన్మించారు కుముదినీ దేవి. అమ్మనాన్నలు చూడామణి, వెంకటరామిరెడ్డి. వారిది జమీందారీ కుటుంబం. పరదా పాటించడం ఆ యింటి ఆనవాయితీ. అప్పట్లో వరంగల్లు ప్రాంతంలో బాలక విద్యాభ్యాసానికి అనువైన వాతావరణం లేదు. అందుచే కుముదినీ దేవికి అయిదో ఏడున్నప్పుడే వెంకటరామిరెడ్డి కుటుంబం హైదరాబాద్‌కి చేరుకొంది. అత్యంత ప్రాచీనమైన సెయింట్ జార్జి గ్రామర్ స్కూల్లో చేర్చారు. ఈ పాఠశాలలో చేరిన కుముదినీ దేవి చదువుతో పాటు, గుర్రపుస్వారీ, కారు డ్రైవింగ్, తుపాకీతో గురిచూసి కాల్చడం వంటి వీరోచిత క్రీడలు, ఆధునిక విద్యలు నేర్చుకున్నారు. వనపర్తి జమీందారు రాజా రామదేవ్‌రావు కుముదినీ దేవిని వరించారు. వారి వివాహం 1928 ప్రాంతాల్లో వైభవంగా జరిగింది. ఎటుచూసినా స్వేచ్ఛాకాంక్ష పోరాటాలు, జాతీయ నినాదాలతో వాతావరణం దేశభక్తి ప్రపూరితంగా ఉండే రోజుల్లో జమీందారీ కుటుంబంలో మెట్టిన కుముదినీదేవి సామాజిక సేవకన్నా మించిన పరమార్థం లేదనుకున్నారు. పర్దా వదలి జనజీవన స్రవంతిలో ప్రవేశించారు. ఆమె నిర్ణయాన్ని ఎవ్వరూ హర్షించకున్నా ఆమె మాత్రం విశ్వాసం పోగొట్టుకోకుండా ముందడుగు వేశారు. అప్పట్లో స్వామి శివానంద ఉన్నత కుటుంబాల వారిని బాగా ప్రభావితం చేశారు. ఆయన శిష్యరికంలో కుముదినీదేవి సమాజసేవే తన లక్ష్యంగా ఎంచుకొన్నారు. 1958 నాటిమాట. ఇప్పుడు ఎంతో బిజీ సెంటరయిన కూకట్‌పల్లి అప్పుడొక అటవీప్రాంతం. అక్కడ 51 ఎకరాల భూమికొని కుముదినీదేవి, స్వామి శివానంద పేరుతో పునరావాస ఆశ్రమం స్థాపించారు. కుష్ఠ వ్యాధిగ్రస్తుల్ని చేరదీసి వారికి అక్కడ చికిత్స ప్రారంభించారు. ఆశ్రమంలోనే ఆహారం, వైద్యం, ఆశ్రయం అన్నీ ఏర్పాటు చేశారు. ఆ సంస్థ క్రమంగా చికిత్సతోపాటు పునరావాసం కూడా చేపట్టింది. ప్రస్తుతం సంపూర్ణ సంస్థలా అభివృద్ధి చెందడానికి జనంపల్లి కుముదినీ దేవి నిస్వార్థ సేవే కారణం.



ఆమె 1958లోనే 'సేవా సమాజ బాలికా నిలయం' అనే సంస్థను స్థాపించారు. ఇక్కడ అనాథ శిశువుల్ని చేరదీసి, వారికి చదువు, వృత్తివిద్యలు నేర్పుతారు. కుముదినీ దేవి తల్లి చూడామణి పేరుతో చూడామణీ వృద్ధాశ్రమాన్ని నెలకొల్పారు. వీటన్నిటితోపాటు నిజామియా హైదరాబాద్ ట్రస్టులో వ్యవస్థాపక సభ్యురాలిగా... ట్రస్టీగా ఉంటూ పాతబస్తీలో వెనుకబడిన వర్గాల మహిళలకు చదువు నేర్పడం వంటి పలు కార్యక్రమాలు అమలు చేస్తున్నారు. 1960లలో కుముదినీ దేవి ప్రత్యక్ష రాజకీయాల్లో ప్రవేశించి హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో కౌన్సిలర్‌గా ఎన్నికయ్యారు. తర్వాత మేయరయ్యారు.

హైదరాబాద్‌లో కుండపోత వర్షం కురిసింది. మూసి పొంగిపారింది. వరదలకు ప్రజలు ఎంతో నష్టపోయారు. ఆమె కంటిమీద కునుకు లేకుండా రాత్రింబవళ్లు పర్యటించి తగిన రక్షణ చర్యలు తీసుకొన్నారు. బాధితులకు అభయహస్తం అందించారు. హైదరాబాద్ వరదబాధితుల్ని ఆదుకొన్నారు. 1962-72 ప్రాంతాల్లో వనపర్తి నియోజకవర్గం నుంచి రెండు పర్యాయాలు రాష్ట్ర శాసనసభకు ఎన్నికయ్యారు. నియోజక వర్గం అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారు. ఆమె సమాజ సేవకు గుర్తింపుగా ఎన్నో అవార్డులు పొందారు. 1994లో 'యుధ్‌వీర్' అవార్డు పొందారు. అలాగే మెహదీజంగ్ సెంటినరీ హ్యూమన్ రైట్స్ అవార్డును అంతకుముందే పొందారు. కుముదినీ దేవి సేవాభావం శ్లాఘనీయం. ●

**LAKSHMANAN S/o Sannasi**
**556 Lorong BSS 1/3 J**
**Bandar Seremban Selatan**
**714 Sungai Gadut. NSDK**
**Malaysia**

**శ్రీరస్తు**

**నమస్కారములు,**

తమరు దయతో పంపిన ప్రముఖాంధ్ర మాస పత్రికలు సక్రమంగా లభించినవి. చాలా కృతజ్ఞతలు. ప్రస్తుతం రూ. 1000/- పంపుచున్నాను. తరువాత రోజుల్లో యింకా పంపుటకు ప్రయత్నిస్తాను. తమరు యింకా కొన్ని దశాబ్దాలపాటు ఆరోగ్యంగా ఉండి తెలుగుభాష సేవ చేయగలరని ఆశిస్తున్నాను. అందులకయి ప్రార్థన చేస్తున్నాను.

GMB ISLAMIC BANK మూలంగా పంపితిని
ACOUNT No Reference No 877792790
CIM 12919 Desc :Ref : 87779270
నమస్కారములతో విరమించుకుంటున్నాను.

సెలవు
ఇట్లు విధేయములతో
పోతురసెట్టి లక్ష్మణ

*(విదేశీ ఆంధ్రుల అభిమానం పొందడం వల్లనే ఆరోగ్యం పెరుగుతూంది)*

